పెద్ద కథ :

# ఎడారి పువ్వులు

[ గత సంచిక తరువాయి ]

## జరిగిన కథ

మధు ఆ వూరికి టీచర్‌గా వచ్చాడు. ఆ వూళ్లో పలుకుబడి పరపతిగల యిద్దరు విరోధులతో ఆయనకి పరిచయ మయింది. అందులో ఒకరు శేషయ్య. ఆయన మధుకు తన యింట్లోనే బస ఏర్పాటు చేసాడు. రెండోవాడు రామనాథం తన కుమారుడికి ప్రైవేటు చెప్పమని మధును అడిగాడు. మధు సరే నన్నాడు కాని ఆ మాట శేషయ్యతో చెప్పే ధైర్యం లేకపోయింది.]

---

మధు - మధుబాబుగా కాకుండా.... పంతులు బాబుగా మారిపోయాడు. అందరూ అతన్ని పంతులు బాబని పిలవటం మొదలెట్టారు. ఆ ఊరి ప్రజల్లో ఒక విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్నాడు.

రోజూ సాయంత్రం రామనాథం అబ్బాయికి చదువు చెప్పటం ఆరంభించాడు. మొట్ట మొదట్లో కొంచెం కష్టమనిపించింది.... తరువాత పిల్లవాడుకూడా ఓపిగ్గా కూర్చోవటంవల్ల మధు ఉత్సాహంగా అతనికర్థమయ్యేటట్లు చెప్పసాగాడు.

"భేష్! పంతులు బాబు! యిక్కడ యింతమంది పంతుళ్ళున్నారు.... కాని ఏం లాభం? మా వాడికి నెలకో పంతుల్ని మార్చాను.... కాని వాడి అశ్రద్ధో లేకపోతే వాళ్ళ అశ్రద్ధో.... వాడికి ఒక్క అక్షరపు ముక్కయినా రాలేదు!"

మధు నవ్వి ఊరుకున్నాడు

"కాని యిప్పుడు వాడు బాగా చదువుతున్నాడోయ్.... బాగా....!" ఆగి మధు ముఖంలోకి చూసి- "ఛ, ఛ! ఏమిటోయ్ పంతులు బ్రతుకు! నాకేం నచ్చలేదు!"

మధు ఆశ్చర్యపోతూ అతనివైపు చూశాడు.

క్షణానికోరకంగా మాట్లాడ్తాడనుకున్నాడు మధు.

సీత తలుపు చాటునుండి తదేకంగా చూడసాగింది మధును

మధు రామనాథం యింటికొచ్చినప్పుడల్లా సీత అతన్ని చాటు - చాటున వుండి

రచన :

ఎం. ఏ. అజీజ్

చూస్తుంది. అప్పుడప్పుడు ఏదో ఆలోచించేదానికిమల్లే అక్కడే కూర్చుని మధు బాబు మాటల్ని వింటూ.... చిన్నగా నవ్వుకునేది.

ప్రపంచంలో రక-రకాల వాళ్ళున్నారు. కాని సీత ఏ రకానికి చెందిందో గట్టిగా చెప్పలేను.

సీతకు మధు కనిపిస్తే చాలు.... అతను ఒక్కసారి నవ్వితే ఆమె పదిసార్లు నవ్వుకుని ఆనందపడ్తుంది.... ఆమెకు అతని నవ్వంటే ఎంతో యిష్టం ఏర్పడింది.

కాదు లేవోయ్ పంతులు బాబు! పంతులు బ్రతుకే హాయి.... కావలసినంత స్వేచ్ఛ....!"

మధుకు మాట్లాడే అవకాశమే యివ్వటంలేదు రామనాథం.

"చూడు పంతులు! ఎలాగో మా వాడికి చెప్తున్నావు... కనుక ఆ సీత తమ్ముడికి కూడా చెప్పు.... పిల్లవాడు తెలివి గలవాడే ననుకో.... వాడూ అదే చదివేది.... డబ్బు విషయంలో నువ్వేం బాధపడకు.... ఆఁ.... సీతా!" కేకేశాడు.... తలుపు చాటునున్న సీత అతని పిలుపుకు ముందు కొంచెం కంగారు పడింది.... కాని అంతలోనే సద్దుకొని- "మాఁవయ్యా!" అంటూ బైటికొచ్చింది.

"ఏఁ లేదు! మీ వెంకటిగాడ్ని రేపటి నుంచి యిక్కడికి పంపు.... మా వాడితో పాటు వాడూ చదువుకుంటాడు!"

సీత సమాధాన మివ్వకుండా మౌనం వహించింది.

"అప్పే! యిందులో ఆలోచించడం దేనికే సీతా....కావాలంటే నువ్వే పంతులు బాబు నడుగు!"

మధు బాబుకు పిచ్చెత్తినట్లయింది.

"ఆయన గోల ఆయనదే గాని ముందున్న వాళ్ళ గురించి కొంచెమైనా ఆలోచించడేఁ?" అనుకున్నాడు మధు.

అయినా పైకేం మాట్లాడలేదు.... అతనికా ధైర్యంలేదు

సీత మధువైపు నవ్వుతూ చూసింది....

మధు "అవునన్నట్లు" తలూపాడు.

సీతకు ఏదో తెలియని ఆనందం శరీరాన్నంతా పాకిపోయింది.

"నీ యిష్టం మాఁవయ్యా!" అంటూ లోపలికి పరుగెత్తింది

"అదీ! నేనేం చెప్పినా తలూపుతారు యిక్కడివాళ్ళు.... కాని ఆ శేషయ్యా....

ఏంవోయ్ పంతులు! నీకక్కడ ఎలాగ గడుస్తోంది.

"బాగానే వుందండి!"

"కష్టమనిపించినప్పుడు యిక్కడికొచ్చెయ్.... ఏఁ?"

మధు మాట్లాడలేదు.

"ఏమిటోయ్!"

"అలాగేనండి!"

హాహాహో! ఎంత పిరికివాడివోయ్!

మధుకు కళ్ళలో నీళ్ళు తిరిగినంత పనైంది.

"వెళ్ళవోయి చీకటి పడ్తుంది!"

మధు సంకోచించకుండా అక్కడ్నుంచి బైట పడ్డాడు.

వెనకనుంచి రామనాథం నవ్వు.......

అప్రియత్నంగా మధుకుకూడా నవ్వొచ్చింది, ఇకముందు ధైర్యంగా వుండాలనుకున్నాడు.

మధు గదికి చేరుకునేసరికి అతనికి ఎవరూ కనిపించలేదు.

నేరుగా గదిలోకెళ్ళి కుర్చీలో కూలబడి శేషయ్యకోసం లోపలిద్వారంవైపు పరోక్షంగా చూశాడు.

వరండాలో లాంతరుచిన్నగావెల్గుతోంది

మంగమ్మ వచ్చింది....

"వంతులు బాబూ! అయ్యగారు లేరు. మీరొచ్చి భోజనంచేయండి!" అంది

"ఎక్కడికెళ్ళారు?"

"దీపావళికి సరుకు పట్టించుకురావటానికెళ్ళారు?"

"సరే వస్తాను!"

మంగమ్మ వేడినీళ్ళుపెట్టివెళ్ళిపోయింది

మధుబాబుకు లేవబుద్ధికాలేదు. అలాగే కళ్ళుమూసుకున్నాడు. ఓ అర్ధరాత్రి మెలకువ వచ్చిందతనికి.

చీకటికి తట్టుకోలేక నింగిలో నక్షత్రం ఏడుస్తోంది.

దారికోమూల రాళ్ళమధ్య ఎండిపోయిన గుంటలో అన్నీమరచి ఒళ్ళు తెలియక ఊగుతోంది గడ్డిపోచ గాలికి....

ఒళ్ళంతాకళ్ళుచేసుకుని సుగంధశ్వాసలు విడుస్తూ సూర్యుని కొత్త కిరణంకోసం ఎదురుచూస్తోంది వికసించిన గులాబి.

మధు ఆవలించి లేచి నిల్చున్నాడు.

ఆకలిగావుంది.

వరండాలో లాంతరు గుడ్డిగా వెలుగుతోంది....అయినా చీకటిగానేవుంది ఆ చీకట్లు....అర్ధరాత్రి రాధకూడా తనలాగే మేల్కొనివుంటుందని మధుకు తెలియదు.

గదిదాటి బైటికొచ్చాడు.

వరండా మెట్లమీద, గులాబిమొక్కకు ప్రక్కగా రాధకూర్చొంది. "ఎవరూ?" ఎండిపోయిన పెదాల్ని తడిచేసుకుంటూ అడిగాడు.

రాధ వులిక్కిపడింది.

"నే నే!"

గొంతు గుర్తుపట్టాడు మధు

పరివాహాన్నిదాటి అంచు అలంకరించుకున్న గడ్డిపోచల్ని పట్టుకొని చిన్నగా గొణిగిన స్త్రీ గొంతులా వుందాగొంతు.

"మీ రా"

క్రొత్తరంగుల్ని చూసి ఆశ్చర్యపోయిన పడిపిల్లవాడిలా ముఖంపెట్టాడు మధు.

"ఏం చేస్తున్నారు?" తిరిగి అతనే అడిగాడు.

"ఏంలేదు....నిద్రరాక....!" గొణిగింది రాధ.

లాంతరువత్తిని ఎక్కువచేశాడు మధు.

కొంతవెలుగు చీకటిని తరిమేసింది.

రాధ యిప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది

"యింతరాత్రిప్పుడు యిక్కడ కూర్చున్నావేం?" మధుఆమెవెనుకకొచ్చిఅడిగాడు

"ఏమీలేదు .... నన్నిలావదలండి .... మీకు పుణ్యముంటుంది!" రాధవేడుకుంది

మధు తిరిగి ఆశ్చర్యపోయాడు,

ఇంతవరకు అతను రాధతో అంతగా మాట్లాడలేదు. అతనికా అవకాశం దొరకలేదు.

"రా ధా"

మందలింపు వుందాగొంతులో.

రాధ కళ్ళెత్తి అతనివైపుచూసి తల వంచుకుంది.

"మీతో మాట్లాడే అధికారం లేకపోవచ్చు....!" ఆగాడు

రాధ ఏడ్వటం మొదలెట్టింది.

మధుకు ఏంచేయాలో తోచలేదు .... అలాగే నిలబడిపోయాడు.

ఐదు పది నిమిషాలు గడచిపోయాయి.

తెల్లవారవస్తోంది....ఎక్కడోకోడికూత

"ఏం జరిగింది?" నిశ్శబ్దాన్ని భరించలేక అడిగాడు.

"నేను నాశనమయ్యాను.... అన్యాయం జరిగింది!" అంటూ రాధ కన్నీళ్ళు తుడుచుకుంది.

మధు నరాలు తెగాయి,

కొన్ని 'సమయాలు' మనుషుల్ని ఎంతో దగ్గరికి తీసుకొస్తాయి.

"ఏమిటా అన్యాయం...నాతో చెప్పండి

రాధ అతని దయకు తట్టుకోలేకపోయింది.

"పంతులుబాబూ!" అంటూ అతన్ని కావలించుకొని ఏడవటం ప్రారంభించింది

మధుకు రాధను ఎలాసముదాయించాలో అర్థం కాలేదు,

"మీ మనసు బాగులేదు ... విశ్రాంతి తీసుకోండి!" అంటూ లోపలికి తీసుకెళ్ళి రాధను మంచమీద పడుకోబెట్టాడు.

"పంతులుబాబూ! మీరు యీ గదిలోనే కూర్చోండి....నన్ను ఒంటరిగా వదలకండి అతను మళ్ళీవస్తాడు... అతను...!"

"ఎవరతను?"

"ఎవరూకాదు...అతనే... నన్నెందుకు యిలాచేశాడు? ఎందుకుతొందరపడ్డాడు?" గొణిగింది రాధ.

"ఎవరూ — ఎవరూ రాధ!

"అతను దుర్మార్గుడు!"

(తరువాయి 25 వ పేజీలో)

## ఎడారి పువ్వులు

(8వ పేజీ తరువాయి)

ఎంత ఆపుకోవాలనుకన్నా రాధకు సాధ్యంకాలేదు.... వెక్కి.... వెక్కి ఏడ్చింది

మధుకు కొంతవరకు అర్థమైంది

చెట్టుమోడులా అలా నిలబడిపోయాడు.

"అసహ్యపడుతున్నారా ?"

రాధప్రశ్నకు సమాధానం యివ్వటానికతనికి నోరు పెగల్లేదు.

మాట్లాడకుండా తలుపుదగ్గరకేసి తన గదిలోకొచ్చాడు మధు

తూర్పు తెల్లవారింది.

రామనాథం బండి శేషయ్య యింటి ముందుకొచ్చి ఆగింది. రామనాథం కంగారుగా బండిదిగి.... బండి ముందుకూర్చున్న రంగయ్యను కేకేశాడు. రంగయ్య బండి దిగి అతనిదగ్గరకొచ్చాడు.

"ఏమోయ్ పంతులుబాబూ! నిద్రలేవలేదా? రావోయ్ కొంచెం సాయంపట్టు!"

రామనాథం గొంతువిని మధు ఆశ్చర్యపోయాడు.

బైటికొచ్చి యింటిముందు నిలబడ్డ రామనాథం రంగయ్యను విస్మయంగా చూశాడు.

"బాబోయ్! శేషయ్యబండి బోల్తా పడింది. గాయాలు తగిలాయి!"

రామనాథం అంతకుమించి యింకేం చెప్పలేకపోయాడు.

మధు పరుగెత్తుకుంటూ పోయాడు.

ముగ్గురు శేషయ్యను పట్టుకుని లోనికి తీసుకొచ్చారు.

శేషయ్యకి తలమీద, కుడికాలికి బలమైన గాయాలే తగిలాయి. గాయాలకు కట్టుకట్టారు. అయినా రక్తం తెల్లటిగుడ్డను తడిపేసింది.

"ఎవరన్నా డాక్టర్ని పిలవండి!" మధు కంగారుపడుతూ అన్నాను.

"ఇక్కడెవరున్నారోయ్ డాక్టరు! ఐనా ఆ ఆయుర్వేదిక్ అనంతయ్య మందుపోసి కట్టుకట్టాడు. పర్వాలేదన్నాడు!" రామనాథం శేషయ్య ప్రక్క కూర్చుంటూ అన్నాడు

ఈ హడావిడికి రాధకూడా వచ్చిందక్కడికి.

బాగా ఏడ్చినట్లయింది.... కళ్ళు వుబ్బి వున్నాయి .... జుట్టంతా చిందరవందరగా వుంది.

"నాన్నకేమైంది మామయ్యా.... యీ కట్లు యీ రక్తం!"

"ఏం లేదమ్మా.... దార్లో ఎద్దు బెదరి బండి బోల్తా పడింది.... ఏవో రెండు - మూడు గాయాలు తగిలాయి.... కంగారు పడకు!" రాధ మాట మధ్యలోనే అందుకుని చెప్పాడు రామనాథం

మధు రాధ గట్టిగా శేషయ్య గుండెను కరుచుకొని ఏడుస్తుందనుకున్నాడు.... కాని రాధ అలా చేయలేదు.

ఆమెలో మాట్లాడేశక్తి నశించిపోయింది మౌనంగా తండ్రి కాళ్ళ దగ్గరికెళ్ళి కూర్చుంది.

"నాలుగైదు రోజుల్లోనే కోలుకుంటాడు కొంచెం వేడిపాలు తాగించు.... నేను మళ్ళీ వస్తాను!" అంటూ వెళ్ళిపోయాడు రామనాథం. మధు శేషయ్యను చూస్తూ గోడకానుకొని అలాగే నిలబడిపోయాడు.

రాత్రి జరిగిన సంఘటన జ్ఞాపకానికొచ్చింది

ఒళ్ళంతా చెమటలు పట్టాయి.... "శేషు ఎంత నిర్దయుడు!" అనుకున్నాడు.

తెల్లవారేసరికి మరో సంఘటన... విరోధులు స్నేహితులయ్యారు.... స్నేహితులు రాధ - శేషు....!" అతనికి ఏదీ అంతుపట్టలేదు.

మతిపోయినట్లయింది.... ఉక్కిరి - బిక్కిరయ్యాడు....

శేషయ్య ఒకసారి కళ్ళు తెరచి రాధ దూరంగా నిల్చున్న మధును చూశాడు. నవ్వాలని ప్రయత్నించాడు.... కాని విఫలుడయ్యాడు.

"నాన్న!" రాధ పిలవాలనుకుంది.... కాని పిలువలేదు.

క్షణాలు మూగపోయాయి.

శేషయ్య మధును దగ్గరికి రమ్మని సైగ చేశాడు.

మధు వెళ్ళాడు.

"కూర్చో!" గొంతుదాటి రాలేదు శేషయ్య మాటలు.

మధు కూర్చున్నాడు.

శేషయ్య ఏదో చెప్పాలని ప్రయత్నించాడు.

తలలోపోటు.... కుడికాలు తీసేసినంత బాధ.... చిన్నగా మూలిగి కళ్ళుమూసుకున్నాడు

మధు రాధను చూడకూడదనే చూశాడు.

రాధ లేచి వెళ్ళిపోయింది.

అయిదు.... పది.... పదిహేను.... గదిలో నిమిషాలు నిర్దయగా గడచిపోతున్నాయి.

రాధ పాలగ్లాసుతో తిరిగొచ్చింది

ఇద్దరు కలసి శేషయ్యకు పాలు తాగించారు.

"రాధ! మీరు యిక్కడే కూర్చోండి నేను కొంచెం రామనాథం యింటికెళ్ళి వస్తాను!" అంటూ లేచాడు మధు

"ఎందుకు?"

మధుకేం తోచలేదు జవాబు చెప్పటానికి

"వెళ్ళకండి!"

"దేనికని?" అడగలేదు మధు.

తిరిగి నిశ్శబ్దం....

మధు తన గదిలోకి తిరిగొచ్చాడు....

అయిదారు రోజులు గడిచిపోయాయి, శేషయ్య కొంచెం కోలుకున్నాడు.

రోజు రామనాథంవచ్చి పలుకరించి పోతున్నాడు.

ఒకరోజు !చుట్ట వెలిగిస్తూ-" అయినా షయ్య బండి బోల్తా పడటంవల్ల.... బోల్తా డిన మాస్నేహం ఒక దారిన పడిందోయ్ పంతులూ ! శేషయ్యకు దెబ్బలు తగలటం ఒకందుకు మంచిదే అయింది !" అని గట్టిగా నవ్వాడు శేషయ్య వైపు చూస్తూ. శేషయ్యకూడా నవ్వాడు.

మధు వాళ్ళిద్దరి వైపు చూస్తూ వుండి పోయాడు.

మరో పదిహేనురోజులు గడచి పోయాయి.... శేషయ్య పూర్తిగా కోలు కున్నాడు.... కొంచెం లేచి అటు - యిటు తిరుగుతున్నాడు.

"అయితే శేషయ్యా - ఆలస్యం అమృతం విషం అన్నారు. నీ అభిప్రాయ మేమిటి ?"

"ఏముంది రామనాథం ! యీ రోజుల్లో మన అభిప్రాయాల్తో పని వుండదు.... ఏమైనా వాళ్ళిష్టపడాలిగాని.... !"

"అదేంటి కొత్తగా మాట్లాడుతున్నావు' మన సాంప్రదాయాలు. కట్టుబాట్లు.... మనం యివన్నీ ఎలా మరచిపోతాం ?"

శేషయ్య నవ్వి ఊరుకున్నాడు.

"ఏది ఏమైనా యీ దీపావళిలోగానే జరగవలసింది జరిగిపోవాలి. రాధ నా యింటి కోడలుగా రావటానికి నిరాకరిస్తే యిన్నాళ్ళు బ్రతికిన బ్రతుకు వృధా."

శేషయ్యా ! యింకా నీకు తెలియదేమో మా వాడికి రాధ అంటే పంచప్రాణాలు !"

'కాని మా రాధకు ఒకటే ప్రాణం....'

యిద్దరు నవ్వుకున్నారు.

"ఛ, ఛ ! అదికాదు శేషయ్యా.... అవి మన కర్థంకావులే ! ఆఁ.... యివ్వాళ్ళే ముహూర్తం పెట్టిస్తాను.... అమ్మాయి నడుగు.... ఏఁ అంటుందో ?"

"అలాగే !"

"అబ్బ ! శేషయ్యా - నువ్వింత తొందరగా ఒప్పుకుంటావని కలలోకూడా అనుకో లేదు.... చూడు యీ పెళ్ళి ఎంత వైభవంగా జరుగుతుందో.... నా కలలు నిజమయ్యాయి ఏడి ! ఏమోయ్ పంతులు బాబు !" కేకే శాడు.

"లేడు ! మీ వాడికి చదువు చెప్పడానికే పోయి వుంటాడు !" అగి- "రామనాథం.... నిజంగా నా రాధ నీ యింట్లో సుఖపడ్తుందంటావా !" అడిగాడు రామనాథం నోరు తెరిచాడు.

"అదేమిటి శేషయ్యా ! నీకా అనుమానం ఎందుకొచ్చింది ? రాధ నీ కూతురేగాని నా కూతురు కాదంటావా ?.... నా యింట్లో నా రాధ సుఖపడదంటావా ? చెప్పు శేషయ్యా ! ఇంతవరకు నా బ్రతుకులో ఏం లోపముందో ?"

"అది కాదు రామనాథం.... తల్లిలేని పిల్ల... చిన్నప్పట్నుంచి ఎంతో గారాబంగా పెంచాను... దానికేం కష్టమొచ్చినా నేను సహించలేను - అందుకని !"

"ఆ విచారం పెట్టుకోకు నువ్వు... నాకు మాత్రం చెప్పుకోవలసిన వాళ్ళెవరున్నారంటావు...? రాధ నా యింటి కోడలు కావాలి... అదే పదివేలు... అంతే !" శేషయ్య యింకేం మాట్లాడలేకపోయాడు.

(సశేషం)

## మారని మనుష్యులు

(13 వ పేజీ తరువాయి)

"రంగయ్యా...." గోపాలం మెల్లిగా పిలిచాడు. రంగయ్య పులిక్కిపడిలేచి "అబ్బాయిగారా... రండిరండి... ఎప్పుడొచ్చారు ఊరునుంచి..." అంటూ పలకరించాడు.

"నిన్నొకమాటఅడుగుతాను రంగయ్యా ఏమీ అనుకోకుండా సమాధానం చెబుతావా గోపాలం సూటిగా అడిగాడు

"అదేటండి.... అట్టా అంటరు. తమాషాగా మాట్లాడుతుండారే ఇయ్యాల...." అన్నాడు రంగయ్య. గోపాలం శరీరంలో వేడిరక్తం పురకలు పెట్టింది. దేశం అత్యవసర స్థితిలోవుంటే మామిడిచెట్టునీడలో నిశ్చింతగా పడుకున్న రంగయ్య అజ్ఞానాంధకారాన్ని ఎట్లా విడలగొట్టడం...." అనుకున్నాడు గోపాలం.

"దేశంఅంతా యుద్ధం గొడవలతో ఉడికివుంటే దేశరక్షణకై నడుంకట్టి ముందుకు దూకాలని వుండదా నీకు.... ఇవన్నీ తెలియకపోతే ఎట్లా రంగయ్యా" అన్నాడు గోపాలం ఆవేశంగా. రంగయ్య మీసాలు సర్దుకుని తాపీగా నవ్వాడు.

"అంతా ఉపన్యాలవిసికాఊరిమీదపడితే పొలంపని చూసేవాడెవడండి మా అయ్య అన్నట్టు రైతుకి పొలమేగాదుటండిఅన్నం పెట్టేతల్లి అనుకున్నా. దేశం అనుకున్నా. ఇంకోటిఅనుకున్నా...." అన్నాడు

(ఆకాశవాణి సౌజన్యంతో)




(Manufacturing Opticians)

శ్రీ కృష్ణా వాచ్ అండ్ ఆప్టికల్ కంపెనీ

పటాభిమార్కెట్ : హైదరాబాద్ రోడ్

మచిలీపట్నం.